# గొప్పకథ

## పమిడిముక్కల ప్రకాశరావు

### చెత్త కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

మా (మీ) యీ పత్రిక యీ పోటీని ప్రకటించిననాటినుండి కుప్ప తెప్పలుగావచ్చిన కథలు కుప్పలుగా తయారు కావటంతో వాటిని ఏరటానికి ఎమర్జన్సీ స్టాఫ్‌ని పిలవటం జరిగింది.

ఆమహోఘట్టంలో, ఒక్క ఏరటం లోనే కాక, ఉత్తమకథ ఎని సంఘంలో నేనూ ఒక సభ్యు కావటం అదృష్టం అనే భావించ లేమో! ఎందుకంటే నాకు అసలు కథంటే ఏమిటో తెలియదుకాబట్టి. కథను చదివి అది ఎలాంటిదో చెప్పగల సామర్థ్యం అసలే లేదు కాబట్టి అయినా యిలాంటి వాటికి సామర్థ్యం ఎందుకు? ఎలాంటి వాడైనా అవలీలగా చెప్పగలడు అది ఎంతగొప్ప కథో! అందుకే నన్నుకూడ పిలిచారేమో?

సరే! కథకి వద్దాం!

అలా వచ్చిన కుప్పల్లో ఎంతో కష్టం భరించి చివరకి కొన్నిటిని సెలెక్ట్ చేశాం! వాటిల్లో చాలవరకు అర్థం పర్థం లేకుండా పోటీకి అర్థం వచ్చేవిగానే వున్నాయి

సభ్యులంతా చర్చించి ఉత్తమ కథ నిర్ణయించాలి అయినా తుది నిర్ణయం ఎడిటర్‌గారిదే!

కథ ఎలావుంది? అసలు కథ వుందా? అడ్డంవచ్చినట్లు గీకిపారే శారా?

పాత్రలు ఎలాంటివి? తుప్పు పట్టాయా? బూజు పట్టాయా? ఇలాంటివి ఎన్నో పాయింట్లుచూసి, మార్కులువేసి ఎంపిక చెయ్యాలి.

రాత్రింబవళ్ళు వళ్ళు వంచకుం డానే (కారణం మీకు తెలుసు!) శ్రమించి చివరకు చిదానందం వ్రాసిన "పెళ్ళాం ముండ మొయ్య" కథకు బహుమతి ఇచ్చి, చిదానందం గారికి మెచ్చుకొని "పరమ చెత్త కథా రచయిత"గా బిరుదుకూడ ఇవ్వాలని నిర్ణయించాం!

ఎడిటర్‌గారి తుదినిర్ణయంకూడ అదే కావటం సంతోషం!

— పోటీ ఫలితాలు ప్రకటించాం

బహుమతి ప్రధానం జరిగి పోయింది.

బహుమతిపొందిన చిదానందాన్ని చూసి ఆశ్చర్యపోయా! చూడటానికి బాగానేవున్నాడు కథకి సరిపడా వుంటాడేమోనని ఆశపడ్డా. నా ఆశలు అడియాశలు చేసేసాడు కోపంకూడ తన్నుకు వచ్చింది

సరే! దాన్నలా వదలేసి చిదానందాన్ని కలిసా! ఎందుకంటే- ఏదో కుతూహలం ఎంత గొప్పగా ఎలా వ్రాసాడో అని అడుగుదామని మళ్ళీ ఇలాంటి పోటీ వుంటే నాకు ఇదొక "ప్లాట్" కావచ్చు నేను కూడ పరమ...కావచ్చు!

"ఏం! మాష్టారూ! నేను రాసిన కొన్ని కథలు చదువుతారేంటి?" అడిగిందే తడవు! ఒప్పేసుకున్నా! ఈ వాసన భరించాలి తప్పదు బిరుదు అలాంటిది మరి!

నేను 'ఓ యస్' అనటం, చిదానందం తన కథల (!!!) చిట్టీ నాకు ఇవ్వటం జరిగిపోయాయి

అబ్బో! బోలెడు కథలు! కథలో తలా తోకల గల్లంతు!

మెలికలు! మెలికలు! అన్నీ మెలికలే!

ఆ మెలికల్లోనే దొరికింది నాకు 'ప్లాట్'! ఈ కథకి అదే 'ప్లాట్'!

అన్ని కథల్లో ఒక కథ పేరు చూసి, కథ చదువుతూ మొదట ఆశ్చర్యపోయా! సాంతం చదివిం తర్వాత మూర్ఛపోయినంత పని!

గావుకేక పెట్టి పిలిచి "గురూగారూ! ఈ చేత్తవ్రాత ఎవరిదీ?" అరిచానో! అడిగానో! కాసేపు నసిగాడు నసిగి నసిగి "అదా! ఇదివరకు మా ప్రక్క పోర్షన్‌లో ఒకాయన వుండేవాడు ఆయనది" కక్కేడు.

"ఆయన పేరు?" అడగకుండా వుండలేక పోయా!

ఆ పేరు వినీ...అంతే! నేను కుర్చీమీద వున్నా, భూమి గల్లంతు కాలేదు. ఆకాశం తల బ్రద్దలు కాలేదు కానీ అయినట్లే వుంది!

అయినా ఏదో ఆశ! ఆ వ్యక్తి కాదని, కారాదని, కాకూడదని! ఇన్ని 'కా'లు వున్నా కావలసింది కాక మానదు కదా!

మరుసటిరోజు కార్యక్రమం!

ఆఫీసులో చెత్తకుండీ వెదకటం మొదలు పెట్టా! కావలసింది దొరికింది

గభాల్న అదీ. నేను సిన్న చిదానందం నుండి దొంగిలించిన కథల వ్రాత కంపేర్ చేశా!

అంతే! ఇప్పుడు నాకు నిజంగానే మతిపోయేట్టు వుంది! మూర్ఛ వచ్చేట్టు వుంది!

నేను కంపేర్ చేసిన వ్రాత ఎవరిదో కాదు!

చెత్తకథల పోటీని ప్రోత్సహించి, నిర్వహించి, ఉత్తమ చెత్త కథను నిర్ణయించిన మా (మీ) ఎడిటర్‌గారిది కావటం!

అబ్బో! ఎడిటర్‌గారో! ఎంత గొప్ప చెత్త కథో!

(ఎడిటర్‌గారికి క్షమార్పణలతో) ❋

